నాగార్జునసాగర్ కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల

ఉత్తమన్నా.. సచ్చేదాక చూడకండి

- సాగు నీళ్లిచ్చి ఆదుకోండి
- పంటలు పోతున్నయి.. తాగనీకె నీళ్లు లేవు
- సోషల్ మీడియాలో రైతు, కాంగ్రెస్ కార్యకర్త ఆవేదన
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇలాకాలో ఇదీ పరిస్థితి

ఎండిన వరి పొలంలో రైతు రమేశ్‌నాయక్

పాలకవీడు, మార్చి 1: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామం తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిపై యువ రైతు, కాంగ్రెస్ కార్యకర్త రమావత్ రమేశ్ సైదానాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. సాగునీరు లేక ఎండి పోతున్న తన పంటను చూపిస్తూ సెల్ఫీ వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఆయనది భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం మరింత చర్చనీయాంశంగా మారింది. రైతు రమావత్ రమేశ్ ఆవేదన ఆయన మాటల్లోనే.. 'ఉత్తమ్ అన్నా, మాది సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామం. మా గ్రామం 50 ఏండ్లుగా కాంగ్రెస్‌కు కంచుకోట. మేము ఓట్లేసి కాంగ్రెస్‌ను గెలిపించుకున్నం. మీరు నీటి పారుదల శాఖ మంత్రి అయినరు. మాకాడ ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు నాకు కొడుకులు, బిడ్డలు లేరు. మీరే బిడ్డలు అని చెప్పారు. గద్దెనెక్కినాక మే మున్నామనే ధ్యాసే మరిచారు. మా పొలాలు ఎండిపోతుంటే ఎవరు స్పందిస్తలేరు. మూసీ ఎండిపోయింది. తాగడానికి నీళ్లు లేవు. జీవాలు అన్ని సచ్చిపోయే స్థితికి వచ్చినయి. ఇది నా పొలం. వందల మంది తినే ఆహారం. నిప్పుపెడితే కాలిపోయేట్టు ఉన్నది. రెండు తడులు నీళ్లిస్తే బయట పడుతాం. ఎందుకు సచ్చేదాకా చూస్తరు. మా మంత్రివర్యులు నిద్ర మత్తులో ఉన్నా.. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నీళ్లయినా, పరిహారమైనా ఇవ్వాలి' అంటూ రమేశ్ వీడియోలో వాపోయాడు.

'చెత్త' మాటలు 'ఉత్త'మమేనా?

- 'ప్రాణహిత-చేవెళ్ల'కు వైఎస్ శంకుస్థాపన
- ఆ తర్వాత ఏడేండ్లు అధికారంలో కాంగ్రెస్
- అప్పుడు కట్టలేక ఇప్పుడు విమర్శలు
- ఉత్తమ్ వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలు నివ్వెరపరుస్తున్నయ్. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి 2014 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. అయినప్పటికీ ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయిన కాంగ్రెస్ ఇప్పుడు తీరిగ్గా కేసీఆర్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టును కేసీఆర్ పూర్తిచేసి ఉండాల్సిందని చెప్పడంపై పలువురు మండిపడుతున్నారు.

అప్పుడు కేంద్రంలోనూ కాంగ్రెస్సే

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పుడు ఉమ్మడి ఏపీతోపాటు మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ ఉన్నవి కాంగ్రెస్ ప్రభుత్వాలే. అయినప్పటికీ 2014 వరకు ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనలను అప్పటి మహారాష్ట్ర సర్కారు తిరస్కరించినప్పటికీ అప్పటి కేబినెట్‌లో ఉన్న ఉత్తమ్ పల్లెత్తు మాట అనలేకపోయారు. కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అయినా సమన్వయం చేసుకోలేకపోయారు. ఇప్పుడేమో మంత్రి హోదాలో ఆ ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించి ఉండాల్సిందంటూ కూనిరాగాలు తీయడంపై ప్రజలు మండిపడుతున్నారు.

కాళేశ్వరం ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన రైతులు

ఆత్మకూర్.ఎస్ మండలం కోటపహాడ్‌లో ఆందోళనకు దిగిన రైతులు

సాగునీటి కోసం రైతు ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట మూడు మండలాల రైతుల ఆందోళన
కాళేశ్వరం నీళ్లు ఇవ్వాలని డిమాండ్

సూర్యాపేట, మార్చి 1 : సాగు నీటికోసం రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఆయకట్టు భూములకు కాళేశ్వరం నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సూర్యాపేట జిల్లా రైతాంగం కలెక్టరేట్ ఎదుట బైఠాయించింది. అందులో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించడంతో ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సూర్యాపేట నియోజక వర్గంలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు ఎస్సారెస్పీ పరిధిలోని 69, 70, 71వ డీబీఎం కాల్వల్లోకి సరిపడా నీళ్లు రాకపోవడంతో ఆయకట్టులోని పంటలు ఎండిపోతున్నాయి. కేసీఆర్ హయాంలో గత నాలుగేండ్లు కాళేశ్వరం జలాలతో ఆయకట్టుకు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు ఎస్సారెస్పీ పరిధిలోని 69, 70, 71వ డీబీఎం కాల్వల్లోకి సరిపడా నీళ్లు రాకపోవడంతో ఆయకట్టులోని పంటలు ఎండిపోతున్నాయి. కేసీఆర్ హయాంలో గత నాలుగేండ్లు కాళేశ్వరం జలాలతో ఆయకట్టుకు రెండు పంటలకు నీరు అందగా, ఇప్పుడు చాలీచాలనట్టుగా వస్తున్న నీళ్లు పంట భూములు తడవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలల్లో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే.. పంట చేతికొచ్చే సమయంలో నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు తట్టుకోలేక పోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరో 15 రోజులపాటు పూర్తి సామర్థ్యంతో నీరు అందిస్తే తప్ప పంటలు కాపాడుకోలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్‌లో ఇప్పటికే సుమారు 300 ఎకరాల్లో వరి ఎండి పోయిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని వారు మండిపడుతున్నారు. కలెక్టరేట్‌కు రావడానికి ముందు కోటపహాడ్ గ్రామ రహదారిపై రాస్తారోకో చేశారు. పెన్‌పహాడ్ మండలం, చివ్వెంల మండలంలోనూ సాగునీరు లేక భూగర్భ జలాలు సైతం అడుగంటి బోర్లు పోయడం లేదని రైతులు ఆవేదన చెందారు. రైతుబంధు రాకపోయినా అప్పులు తెచ్చి పంటలు సాగు చేశామని, ఇప్పుడు నీళ్లు కూడా ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. తన పంట పూర్తిగా ఎండిపోతున్నదని, ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం నీటిని సరిపడా విడుదల చేయాలని నూతనకల్ మండల కేంద్రానికి చెందిన మల్లారెడ్డి పురుగుల మందు తాగడానికి ప్రయత్నించగా.. అక్కడే ఉన్న రైతులు, పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం రైతులు కలెక్టరేట్ ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మేడిగడ్డకు రిపేరు చేసి నీళ్లిస్తాం

- నెల రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ నివేదిక
- విజిలెన్స్ రిపోర్టు ప్రకారం చర్యలు
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్
- బీఆర్ఎస్ ఆందోళనలకు తలొగ్గిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఆందోళనలకు అధికార కాంగ్రెస్ మరోమారు తలొగ్గింది. మేడిగడ్డకు మరమ్మతులు చేసి పంటలు కాపాడాలన్న బీఆర్ఎస్ నేతల డిమాండ్‌కు దిగొచ్చింది. బరాజ్‌కు మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పడమే అందుకు నిదర్శనం. శుక్రవారం సచివాలయంలో మంత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మేడిగడ్డ బరాజ్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నెల రోజుల్లో నివేదిక అందిస్తుందని, దాని ఆధారంగా బరాజ్‌కు మరమ్మతులు చేసి రైతులకు నీళ్లు అందిస్తామని తెలిపారు. మేడిగడ్డను ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్మించిందని, రికార్డుల్లో సబ్ కాంట్రాక్టర్ల పేర్లు లేవని పేర్కొన్నారు. కాబట్టి ఆ సంస్థకు సంబంధించి రూ. 400 కోట్ల నిధులు పెండింగ్‌లో పెట్టినట్టు వివరించారు. తాను శనివారం ఢిల్లీ వెళ్తున్నానని, మేడిగడ్డ అంశంపై పలువురు నిపుణులను, అధికారులను కలుస్తానని చెప్పారు.

శ్రీరాం వ్యాఖ్యలు అవాస్తవం

మేడిగడ్డపై తాము సమాచారం గానీ, పత్రాలు గానీ ఇవ్వలేదని కేంద్రజలశక్తిశాఖ సలహాదారు వెదిరె శ్రీరాం చెప్పడం అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు గత ప్రభుత్వం జియోలాజికల్ ప్రొఫైల్ చేయలేదని, థర్డ్ పార్టీ రిపోర్ట్స్ లేకపోవడం వల్లే పత్రాలు ఇవ్వలేదని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ బృందాన్ని ఆహ్వానించింది తామేనని, వారికి పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ రిపోర్ట్ అందిందని, చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరిగిన నష్టానికి ప్రాజెక్టుపై ఉన్న లోన్లను కేసీఆర్, కేటీఆర్ కట్టాలని డిమాండ్ చేశారు. తమ మ్యానిఫెస్టోలో తుమ్మిడిహట్టి ఉన్నదని స్పష్టం చేశారు. అక్కడ నీళ్ళు లేవని సీడబ్ల్యూసీ చెప్పిందంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చినట్టు స్వయంగా అధికారులు చెప్పారని గుర్తుచేశారు. అక్కడే ప్రాజెక్టు కట్టి ఉంటే 16 లక్షల ఆయకట్టుకు ఇప్పటికే నీళ్ళు అందేవని చెప్పారు. బీఆర్ఎస్ చేసిన తప్పుల్లో కేంద్రం పాత్ర కూడా ఉన్నదని ఆరోపించారు. మేడిగడ్డకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టును చూసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్‌పై సీఆర్పీఎఫ్ బలగాలను తొలగించాలని కోరినట్టు తెలిపారు.

నల్లగొండలో రిజైన్ చేసి సిరిసిల్లలో పోటీ చేస్తా

- ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- కేటీఆర్‌కు సవాల్ విసిరిన మంత్రి కోమటిరెడ్డి
- మీడియాతో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, పొన్నం చిట్‌చాట్

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): నల్లగొండలో నేను రాజీనామా చేస్తా.. కేటీఆర్ సిరిసిల్లలో రాజీనామా చేయాలి.. ఆ తర్వాత ఇద్దరం సిరిసిల్లలో పోటీ చేద్దామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. ఒకవేళ నేను సిరిసిల్లలో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా.. మరి కేటీఆర్ ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీని మూసేస్తారా? అని ఆయన సవాల్ విసిరారు. శుక్రవారం సచివాలయంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నేను సిరిసిల్లలో పోటీ చేసి గెలుస్తా.. మరి అక్కడ కేటీఆర్ ఓడిపోతే పార్టీ క్లోజ్ చేస్తారా?'.. అని ప్రశ్నించారు. 'నాకు క్యారెక్టర్ ఉంది కానీ, డబ్బులు మాత్రం లేవు'.. అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ధర్మపురి అరవింద్, బండి సంజయ్ తాము పెద్ద లీడర్లమని అనుకున్నారు కానీ ఎమ్మెల్యేగా కూడా గెలువలేదని ఎద్దేవా చేశారు. వీరిద్దరూ పొలిటికల్ లీడర్లు కాదని, గతంలో గాలిలో గెలిచారని ఎద్దేవా చేశారు. తమ ఉనికిని కాపాడుకునేందుకే నోటికొచ్చినట్టు మాట్లాడుతూరని విమర్శించారు. నలుగురు బీజేపీ ఎంపీలు ఎప్పుడూ పార్లమెంట్‌లో మాట్లాడేటప్పుడు తాను చూడలేదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థి బీజేపీనే తప్ప బీఆర్ఎస్ కాదని చెప్పారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరుతున్నామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి తెలిపారు. రాహుల్‌గాంధీ నల్లగొండ, భువనగిరి.. ఈ రెండు స్థానాల్లో ఎక్కడి నుంచి పోటీ చేసినా నాలుగు లక్షలకుపైగా మెజారిటీ వచ్చే బాధ్యత తాము తీసుకుంటామని కోమటిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

మూడు కార్పొరేషన్లకు చైర్మన్లు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించినట్టు సమాచారం. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఓబెదుల్లా కోత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ హందాన్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా దీపక్ జాన్‌ను నియమించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తే ఊరుకోం

ఉద్యమ ఫలాలను కాలరాసే విషపు కుట్రలను మానుకోవాలి

- వానకాలంలోపు మేడిగడ్డ బరాజ్‌ను రిపేర్ చేయాలి
- రాజకీయాలు తరువాత ముందు రైతులకు నీళ్లివ్వాలి
- చిల్లర రాజకీయాలతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేయొద్దు
- నాలుగేళ్లలోనే కాళేశ్వరం పూర్తి చేసి నీళ్లిచ్చిన కేసీఆర్
- అన్నారం బరాజ్ వద్ద హరీశ్‌రావు

మేడిగడ్డ బరాజ్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో కడియం, పోచారం, ఎర్రబెల్లి, కొప్పుల తదితరులు

వరంగల్, మార్చి 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జయశంకర్ భూపాలపల్లి, (నమస్తే తెలంగాణ): మరమ్మతు పనుల్లో జాప్యం వల్ల మేడిగడ్డ బరాజ్‌కు మరింత నష్టం జరిగితే అందుకు రేవంత్‌రెడ్డి సర్కారే బాధ్యత వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. వానకాలం వచ్చేలోగా మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేసి, రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ ఫలితం కాళేశ్వరం ప్రాజెక్టు అని, దానిని కాలరాసే విషపు కుట్రలను మానుకోవాలని హితవు చెప్పారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా అన్నారం బరాజ్ వద్ద నిర్వహించిన ప్రెస్‌మీట్, ఫైనల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి.. మమ్మల్ని ఎంతైనా హింసించండి కానీ మేడిగడ్డ ప్రాజెక్టును ధ్వంసం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారాలతో కాలం వెళ్లదీస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరాన్ని కాపాడుకునేందుకు తాము చలో మేడిగడ్డకు పిలుపునిస్తే, దాని నుంచి ప్రజలను, మీడియాను డైవర్ట్ చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి పర్యటనకు పిలుపునిచ్చారని దుయ్యబట్టారు. ఇలాంటి చిల్లర రాజకీయాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయబోతున్నారనే అనుమానం కలుగుతున్నదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు సీట్లు పొందాలనే దుగ్ధ తప్ప నీళ్లిద్దామనే ఆలోచన లేదని విమర్శించారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగి మూడు నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు ప్రాజెక్టు పునరుద్ధరణపైన నిర్మాణాత్మకమైన వైఖరిని వెల్లడించలేదని మండిపడ్డారు. ఒకవైపు మేడిగడ్డను సేఫ్‌జోన్‌కు తెచ్చేందుకు పునరుద్ధరణ పనులు చేస్తూనే, మరోవైపు అన్నారం నుంచి కాళేశ్వరం ఆయకట్టుకు నీళ్లు అందించడం సాధ్యమవుతుందని సూచించారు. ప్రాజెక్టులో తలెత్తిన లోపాన్ని సరిదిద్దకుండా, ఆ సాకుతో తెలంగాణ రైతుల ప్రయోజనాలను, తెలంగాణ వ్యవసాయ ప్రయోజనాలను పణంగా పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న కపటనాటకం తెలంగాణ రైతాంగం పాలిట పెనుశాపంగా మారబోతున్నదని హెచ్చరించారు. మేడిగడ్డలో తలెత్తిన లోపాన్ని సాకుగా చూపించి, యావత్ కాళేశ్వరాన్ని విధ్వంసం చేసే కుట్రకు పాల్పడుతున్నదనే అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఈ అనుమానాన్ని మరింత బలపరుస్తున్నదని చెప్పారు. బాంబులు పెట్టి ప్రగతిభవన్ పడగొడుతానని గతంలో రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌ను రాజకీయ క్షేత్రంలో పడగొట్టడం కోసం కాళేశ్వరాన్ని పడగొట్టాలనే ధ్వంసరచన సీఎం నేతృత్వంలో జరుగుతున్నదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును చెత్త ప్రాజెక్టుగా పేర్కొనడం, ఇంజినీర్లను అవమానించడమేనని, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయడేమనని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ఎందుకు క్షమాపణ చెప్పాలని ప్రశ్నించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తే 16 లక్షల ఎకరాల ఆయకట్టుకే నీళ్లు అందుతాయని, కాళేశ్వరం ద్వారా 38 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని వివరించారు. కాళేశ్వరం ద్వారా నీళ్లు ఆయకట్టును డబుల్ చేసినందుకు క్షమాపణ చెప్పాలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ఏడేండ్లు వృథా చేస్తే, బీఆర్ఎస్ పార్టీ మాత్రం నాలుగేండ్లలో కాళేశ్వరం పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించిందని వివరించారు. రైతన్న కష్టాలు, కడగండ్లు తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు అందించామని స్పష్టంచేశారు. కాళేశ్వరం ద్వారా మొత్తంగా 20,33,572 ఎకరాలకు నీరు అందించామని, ఈ ప్రాజెక్టు ద్వారా సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి, మత్స్య సంప ద, భూగర్భ జలాలు పెరిగిందని ఆయన వివరించారు.

> డిప్లెక్షన్, డైవర్షన్, డిస్టార్షన్, డిస్ట్రక్షన్ అంతిమంగా రిగ్రేషన్. అనే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉన్నది. అంటే ప్రతిపక్షం మీద దాడి చేయడం, ప్రజల దృష్టిని మళ్లించడం, వాస్తవాలను వక్రీకరించడం, నిర్లక్ష్యంతో జాతీయ సంపదను విధ్వంసం చేయడమే. మొత్తంగా తిరోగమన దిశలో ప్రభుత్వం పయనిస్తున్నది.
>
> -మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు

కాంగ్రెస్ 'ప్రాజెక్టుల' పిక్నిక్!

- 'పాలమూరు-రంగారెడ్డి'పై అబద్ధాల ప్రచారం
- వంశీచంద్ వన్ మ్యాన్ షో
- విహారయాత్రగా కరివెన యాత్ర
- పీఆర్ఎల్ఐపై హామీ ఇవ్వని నేతలు
- 'కరివెన, ఉదండాపూర్' పనులు చూసి హస్తం నేతల షాక్
- మమ్మల్ని కలవకుండానే వెళ్లిపోయారంటూ రైతుల ఫైర్

మహబూబ్‌నగర్/జడ్చర్ల, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం శుక్రవారం మేడిగడ్డ సందర్శనకు పిలుపునివ్వగా.. అందుకు కౌంటర్‌గా అదే రోజు హస్తం పార్టీ చేపట్టిన 'పాలమూరు-రంగారెడ్డి' రిజర్వాయర్ల సందర్శన ఆద్యంతం విహారయాత్రగా సాగింది. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలను తీసుకొచ్చి ఉదయం 11 గంటలకు కరివెన, మధ్యాహ్నం 3 గంటలకు ఉదండాపూర్ రిజర్వాయర్లను సందర్శించి హడావిడి చేశారు. అక్కడ వారం దరినీ డమ్మీ చేసి మీడియా ముందు అంతా వన్ మ్యాన్ షో నడిపారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ (పీఆర్ఎల్ఐ)పై పచ్చి అబద్ధాలు మాట్లాడిన వంశీచంద్.. వాటిని మీడియాకు చూపించకపోవడంతో యాత్ర తుస్సుమన్నది. ఈ ప్రాజెక్టుపై అవగాహనారాహిత్యంతో మాట్లాడటంతో అక్కడికి వచ్చిన మీడియా, రైతులు నవ్వుకున్నారు. ఈ యాత్ర రైతుల ప్రయోజనం కోసం చేసినట్టుగా లేదని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పిక్నిక్‌గా ఉందని చర్చించుకున్నారు. ఎత్తిపోతలపై పథకంపై అధికార పార్టీ స్టాండ్ ఏమిటో వివరించలేదని విమర్శలు వెల్లువెత్తాయి.

రిజర్వాయర్లపై పచ్చి అబద్ధాలు

పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. ఉదండాపూర్ సర్జ్‌పూల్ పనులు పూర్తయి మోటర్లు బిగించే ప్రక్రియ నడుస్తున్నది. ఇటు వట్టెం రిజర్వాయర్ నుంచి అటు కరివెన రిజర్వాయర్ నుంచి ఉదండాపూర్ వరకు లింకు కెనాల్ పనులు కూడా సాఫీగా జరుగుతున్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా కాంగ్రెస్ నేతలు కేవలం రాజకీయ విమర్శలకు వాడుకోవడం కనిపించింది. భూత్పూర్ నుంచి భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన హస్తం పార్టీ నేతలు తాటిపర్తి వద్ద కరివెన రిజర్వాయర్ కట్టపై ఎక్కి దాదాపు 6 కిలోమీటర్లు ప్రయాణించి కట్ట అటు ఇటు చూస్తూ నిశ్చేష్టులయ్యారు. కొందరు కాంగ్రెస్ నేతలు ఇంత పని జరిగిందా? అంటూ ముక్కున వేలేసుకున్నారు. అక్కడి నుంచి హడావిడిగా మీడియా పాయింట్ వద్దకు వచ్చి పాలమూరు ప్రజలపై కేసీఆర్‌కు ప్రేమ లేదన్నట్టు ఆరోపణలు చేశారు.

పీఆర్ఎల్ఐపై అవగాహన లేని కామెంట్లు

పాలమూరు ఎత్తిపోతల పథకం ఒక ఇంజినీరింగ్ అద్భుతమని రాష్ట్ర ప్రజలంతా కొనియాడుతుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ ప్రాజెక్టుపై అబద్ధాలు వల్లించారు. ప్రాజెక్టు డిజైన్, సర్జ్‌పూల్, పంప్‌హౌస్, రిజర్వాయర్ల నిర్మాణం గురించి మాట్లాడకుండా కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు ఏ విధంగా జరిగాయో? ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. ఇదే కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టుపై ఎన్ని కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారో.. దీన్ని కప్పిపుచ్చుతూ కాంగ్రెస్ నేతలు అవగాహన లేకుండా మీడియా ముందు మాట్లాడటాన్ని చూసిన రైతులు అవాక్కయ్యారు. పాలమూరు ఎత్తిపోతల స్ట్రక్చర్ ఏ విధంగా ఉందో కూడా కాంగ్రెస్ నేతలకు తెలియదని తేటతెల్లమైంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం ఎన్ని టీఎంసీలు? ఎంత ఆయకట్టు? అనే విషయంలో కూడా నోటికొచ్చిన ఆయకట్టు వివరాలను చెప్పగా.. మీడియా అవాక్కైంది. కరివెన రిజర్వాయర్ నాసిరకంగా నిర్మించారని వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. వర్షం నీళ్లకే సీపేజ్ వస్తున్నదని ఆరోపణలు గుప్పించిన ఆయన.. మీడియాకు మాత్రం ఎక్కడా చూపించలేదు. కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల సందర్శనకు వచ్చిన హస్తం పార్టీ నేతలు.. వాటి కింద ఉన్న రైతులను కనీసం పలుకరించకుండా వెళ్లిపోయారు. సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్న శ్రీనివాసరెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, పర్నికారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

మోర్తాడ్, మార్చి 1: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి శుక్రవారం 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. తాగునీటి కోసం మార్చి ఒకటిన నీటిని విడుదల చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర జల వనరుల సంఘం పర్యవేక్షణలో బాబ్లీ నుంచి నీటిని దిగువకు వదిలారు.